జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం... అది చాలా మంచి రోజన్న వాస్తు నిపుణుడు 2

Neti Velugu
# నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

## రిపోర్టర్లు కావలెను
నేటి వెలుగు తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో మరియు మండల హెడ్ క్వార్టర్స్ లో రిపోర్టర్లు కావాలి
ఆసక్తి గలవారు ఈ నెంబర్కు సంప్రదించండి:-
సంపాదకులు పామనగుండ్ల నవీన్ కుమార్ గౌడ్
9553276552.

నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 59 | మే 31 ఆదివారం 2026 | పేజీలు : 4 | వెల రూ. 4.00/-
NALGONDA | VOL:3 | ISSUE: 59 | PAGES:4 | SUNDAY MAY 31 2026 | Rs. 4:00

# మోటార్లకు మీటర్లు... బీఆర్ఎస్‌కు సవాల్ విసిరిన రేవంత్ రెడ్డి





- వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయబోమని సవాల్
- మీటర్లు పెట్టకపోతే బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకుంటుందా అని ప్రశ్న
- హరీశ్ రావు ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని రేవంత్ విమర్శ
- రైతులకు నాణ్యమైన విద్యుత్ కోసమే 'రైతు డిస్కం' అని స్పష్టత
- వడ్లు కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు నిరసనలని హెచ్చరిక

రైతుల హక్కుల కోసం రేవంత్ పోరాటం!

తెలంగాణలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకే 'రైతు డిస్కం' ఏర్పాటు చేస్తున్నారంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ ఆరోపణలను ఖండిస్తూ, బీఆర్ఎస్‌కు సంచలన సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం మోటార్లకు మీటర్లు బిగించినా, ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేసినా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయబోదని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, తాము మీటర్లు పెట్టకుండా ఉచిత విద్యుత్‌ను విజయవంతంగా కొనసాగిస్తే, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటుందా? అని నిలదీశారు.'రైతు డిస్కం' ఏర్పాటు వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని రేవంత్ రెడ్డి వివరించారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన, అంతరాయం లేని ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, జవాబుదారీతనం పెంచడమే దీని లక్ష్యమని తెలిపారు. దేశంలోనే ఇలాంటి ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. బ్లాక్‌మెయిల్ చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని, ఎలాంటి ప్రతిపాదన లేకుండానే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఎవరెవరితో మాట్లాడుతున్నారో తన దగ్గర పూర్తి సమాచారం ఉందని, వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్‌పై ఒట్టేసి చెప్పాలని సవాల్ విసిరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసే పోటీ చేస్తాయని జోస్యం చెప్పారు. ధాన్యం కొనుగోలు అంశాన్ని కూడా ప్రస్తావించిన సీఎం, మద్దతు ధర ప్రకటించిన కేంద్రమే వడ్లు కొనాలని, లేదంటే జూన్ 15 తర్వాత బీజేపీ నేతల ఇళ్ల ముందు వడ్ల కుప్పలు పోస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విద్యుత్, కాళేశ్వరం అక్రమాలపై సీబీఐకి ఫిర్యాదు చేశామని, దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. తాను 2034 వరకు తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని, 2029లో కూడా కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

**పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరిక**

**మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తీవ్ర వడగాల్పులకు అవకాశం**

**ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించింది. ఈరోజు మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో వడగాల్పులు తీవ్రంగా (మిగతా 2వ పేజీలో..)




## చెరువు మధ్యలో కట్ట నిర్మించి.. రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా

**హైదరాబాద్ శివారులోని ముష్కిన్ చెరువు కబ్జా యత్నం భగ్నం**

**చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను కూల్చివేసిన హైడ్రా**

**రెండు నెలల నోటీసు తర్వాత రంగంలోకి దిగిన అధికారులు**



2

## అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ పై సీఎం చంద్రబాబు ఫోకస్

**ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం**

**భవిష్యత్ ప్రణాళికలపై చర్చ.. మొత్తం 18 ప్రతిపాదనలకు ఆమోదం**

**హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన**

**9 జిల్లాలను కలుపుతూ అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ప్రణాళిక**



అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచే దిశగా (మిగతా 2వ పేజీలో..)

## నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు: కేటీఆర్

**ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్**

**గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య**

**కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ**

తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన (మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

# నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

# చెరువు మధ్యలో కట్ట నిర్మించి.. రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) అధికారులు భగ్నం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలోని పుప్పాలగూడ, నార్సింగి సమీపంలో ఉన్న ముష్కిన్ చెరువును ఆక్రమించుకునేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. సుమారు రూ.5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు.వివరాల్లోకి వెళితే, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముష్కిన్ చెరువుపై కన్నేశారు. పేదలతో గుడిసెలు వేయించి, భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. గ్రామ రికార్డుల ప్రకారం 59.11 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు మధ్యలో ఏకంగా మట్టితో కట్ట నిర్మించి, 34 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసేందుకు ప్లాన్ చేశారు. ఈ విషయంపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు, ఆక్రమణదారులకు రెండు నెలల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయినా వారు ఖాళీ చేయకపోవడంతో శనివారం చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టను, గుడిసెలను పూర్తిగా తొలగించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చెరువు సరిహద్దుల వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను ప్రారంభించారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఉండవచ్చని పేర్కొంది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని హెచ్చరించింది.ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. సిద్దిపేట, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కూడా ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావం కారణంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈరోజు ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో వర్షాలకు ఆస్కారం ఉందని వెల్లడించింది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.


## జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం...

### అది చాలా మంచి రోజన్న వాస్తు నిపుణుడు

**సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నిక**

**ప్రమాణ స్వీకారం ఖరారు చేసిన వాస్తు నిపుణుడు గురూజీ ఆరాధ్య**

**జూన్ 3 సాయంత్రం 5:15 గంటలకు వృశ్చిక లగ్నంలో కార్యక్రమం**



డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. వాస్తు నిపుణులు గురూజీ ఆరాధ్య స్వయంగా ఈ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు శనివారం ప్రకటించారు.శివకుమార్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన గురూజీ ఆరాధ్య, జూన్ 3 బుధవారం రోజు వృశ్చిక లగ్నంలో ప్రమాణ స్వీకారానికి శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. వాస్తవానికి జూన్ 5వ తేదీని పరిశీలించినా, ఆ రోజు ఓ ముఖ్యమైన వ్యక్తి అందుబాటులో ఉండరన్న కారణంతో జూన్ 3ని ఖరారు చేసినట్లు ఆయన వివరించారు. శివకుమార్ జాతకానికి సంబంధించిన జ్యోతిష్యపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ బెంగళూరులోని అజ్జయ్య మఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను కలిసిన అనంతరం ఆయన స్వామీజీతో భేటీ అయినట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా డీకే శివకుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధరామయ్య సీఎల్పీ నేతగా (తదుపరి సీఎంగా) డీకేఎస్ పేరును ప్రతిపాదించగా, కాంగ్రెస్ సభ్యులు బలపరిచారు.

# అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ పై సీఎం చంద్రబాబు ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ఆయన అధ్యక్షతన జరిగిన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో 18 కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాజధానిలో పటిష్టమైన అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ ఉండాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో భాగంగా, హైకోర్టు భవనాలకు సంబంధించి వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.547.07 కోట్లు కేటాయించడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు పీపీపీ పద్ధతిలో జెయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి, భవన నిర్మాణ వివాదాల సత్వర పరిష్కారానికి ప్రత్యేక బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పాటు, అమరావతిలో సమర్థవంతమైన అగ్నిమాపక నియంత్రణ కోసం సీఆర్డీఏకు సొంత ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకునేందుకు అంగీకరించారు.ఏలూరు నుంచి ప్రకాశం వరకు 9 జిల్లాలకు విస్తరించే అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు కూడా అంగీకారం తెలిపారు. రాజధానిలోని అన్ని భవనాలకు సెంట్రల్ కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ప్రతి టౌన్‌షిప్‌లో ఆర్థిక కార్యకలాపాలు ఉండేలా చూడాలని సీఎం సూచించారు. వీటితో పాటు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఎల్పీఎస్ లేఅవుట్లలో ఏటీఎంల ఏర్పాటు, 495 మంది రైతులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి పలు అంశాలను అథారిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సీఎస్ జి. సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.కోటి మంది లక్ష్యంగా 'యోగాంధ్రఏ2026'.. జూన్ 21న కృష్ణా నదిపై సీఎం యోగాఅంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో 'యోగాంధ్రఏ2026' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 21న జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు కోటి మంది ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ కార్యక్రమ నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా, జూన్ 21న రాజధాని అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా ఈవెంట్ నిర్వహించనున్నారు. కృష్ణా నదిపై కొత్తగా నిర్మించిన వంతెనపై జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొంటారు. అదే రోజున అన్ని జిల్లా కేంద్రాల్లో వెయ్యి మంది చొప్పున యోగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వీటిలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు.జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా వారోత్సవాలు జరగనున్నాయి. "ఒక జిల్లా – ఒక థీమ్"తో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాష్ట్రంలోని 56 పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక యోగా సెషన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గాను ప్రతి జిల్లాకు రూ. 25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఉన్న 1.50 లక్షల మంది యోగా శిక్షకులకు అదనంగా మరో లక్ష మందికి శిక్షణ ఇచ్చి, వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగం చేయనున్నారు.

**ప్రజలకు అందుబాటులో యోగా వీడియోలు**

ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించిన 'యోగాంధ్ర' పోస్టర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. వివిధ ఆసనాలు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలపై తాను రూపొందించిన వీడియోలను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు మంతెన తెలిపారు. 8142404888 నంబర్‌కు అని మెసేజ్ పంపడం ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ వీడియోలను పొందవచ్చని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ టీడీపీ అధ్యక్షుడి వ్యాఖ్యలను ఖండించిన చంద్రబాబు

- బక్కని నర్సింహులు వ్యాఖ్యలను తప్పుపట్టిన సీఎం చంద్రబాబు
- చారిత్రక ప్రాంతాలపై మాట్లాడేటప్పుడు జాగ్రత్త అవసరమని హితవు
- 'గొడ్డలి పార్టీ' అనే పేరుతో వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందన్న సీఎం
- వివేకా హత్య కేసులో సునీత పోరాటానికి సంపూర్ణ మద్దతు
- నియోజకవర్గాలను 50 శాతం పెంచితే రాష్ట్రానికి నష్టం ఉండదని సూచన



తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు తప్పుపట్టారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు నేతలు సంయమనం పాటించాలని, ఎవరి మనోభావాలను దెబ్బతీయకూడదని ఆయన హితవు పలికారు. "తెలంగాణ అనే పదం నిఘంటువులోనే లేదు" అంటూ బక్కని ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు ఈ స్పష్టత ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. తెలుగు జాతి ఒక్కటేనని, తెలంగాణలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని స్పష్టం చేశారు.అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్ లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. వైసీపీపై చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. 'గొడ్డలి పార్టీ' అనే పేరు ప్రజల్లోకి బలంగా వెళుతుండటంతో వారిలో ఫ్రస్టేషన్ పెరిగిపోతోందని వ్యాఖ్యానించారు. వైఎస్ కుటుంబ అరాచకాలు తమకు కూడా పూర్తిగా తెలియవని, ఇలాంటి వారు ప్రజాస్వామ్యానికి పనికిరారని అన్నారు.వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత చేస్తున్న పోరాటానికి చంద్రబాబు మద్దతు తెలిపారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని, ఆమె పోరాటం వల్లే ఈ కేసు ఇంకా సజీవంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పట్టుదలగా ఉందని, అవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తెస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పునర్విభజనలో రాష్ట్రానికి నష్టం జరగకుండా ప్రస్తుతమున్న స్థానాలను 50 శాతం పెంచితే మేలు జరుగుతుందని సూచించారు.

# మేనల్లుడిపై దాడి... బీజేపీపై మమతా బెనర్జీ ఆగ్రహం

**టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీపై సోనార్‌పూర్‌లో దాడి**

**దాడికి బీజేపీ ప్రభుత్వమే కారణమన్న మమత బెనర్జీ**

**పాలకులు హంతకులుగా మారారని తీవ్ర వ్యాఖ్య**


**ఈ దాడిని ఖండించిన కాంగ్రెస్, ఎస్పీ అధినేతలు**

**పోలీస్ భద్రత లేకపోవడంపై విపక్షాల విమర్శలు**

పశ్చిమ బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ ఎంపీ అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఆరోపించారు.శనివారం సాయంత్రం మమతా బెనర్జీ సోషల్ మీడియాలో స్పందిస్తూ, "పాలకులు హంతకులుగా మారారు. బీజేపీ సిగ్గుపడాలి" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడికి సంబంధించిన వీడియోను కూడా ఆమె తన పోస్టులో పంచుకున్నారు. ఎన్నికల హింసలో ప్రాణాలు కోల్పోయిన సంజూ కర్మాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన అభిషేక్‌పై బీజేపీ మద్దతు ఉన్న దుండగులు దాడికి పాల్పడ్డారని టీఎంసీ ఆరోపించింది.ఈ దాడిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతకు ఉద్దేశపూర్వకంగానే సరైన పోలీస్ భద్రత కల్పించలేదని, ఇది బీజేపీ ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ప్రతిపక్ష నేతలకు భద్రత కల్పించాలని, ఇలాంటి దాడులను నివారించాలని ఆయన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత, యూపీ ప్రతిపక్ష నేత అఖిలేష్ యాదవ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. టీఎంసీ కీలక నేతపై జరిగిన ఈ దాడి, బెంగాల్‌లోని బీజేపీ ప్రభుత్వం ద్వేషపూరిత, హింసాత్మక రాజకీయాలు మాత్రమే చేయగలదని నిరూపించిందన్నారు. సున్నితమైన వాతావరణంలో పోలీసుల గైర్హాజరు వెనుక పెద్ద కుట్ర ఉందని ఆయన ఆరోపించారు.



# గోల్డెన్ అవర్ అవగాహనతో ప్రాణాలు కాపాడొచ్చు: కలెక్టర్





**రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అధికారులు బాధ్యతగా పనిచేయాలి.**
**గోల్డెన్ అవర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలి**
**జూన్ నెలలో పాఠశాలల ప్రారంభం సందర్భంగా స్కూల్ బస్సులపై ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించాలి**
**మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి-**
**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.**

**సూర్యాపేట, మే,30 నేటి వెలుగు ప్రతినిధి**

రోడ్డు ప్రమాదాల నుండి ప్రజల ప్రాణాలను కాపాడడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని దీనిలో అన్ని శాఖల అధికారులు బాధ్యత తీసుకుని రోడ్డు భద్రత చర్యల్లో భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ వి సి హాల్ నందు జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవే అధికారులు, ఆర్ అండ్ బి, రైల్వే అధికారులు, ఇరిగేషన్, ఆర్టీవో, ఎడ్యుకేషన్, డిఎంహెచ్వో, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం సంబంధించి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా ఎస్పీ కె నరసింహ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండ ప్రజలకు అవగాహన కల్పించడానికి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలలో జిల్లా యంత్రాంగం బాధ్యతగా తీసుకొని ప్రజలను, విద్యార్థులను, యువత ను చైతన్యవంతం చేయాలని సూచించారు. రహదారుల పైన లోపాలను గుర్తించి సవరించాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు పెద్ద ఎత్తున గ్రామాలలో రోడ్డు భద్రత అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులను భాగస్వామ్యం చేసి రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమవుతున్న సందర్భంగా స్కూల్ బస్సులపై తనిఖీలు చేసి బస్సు లు ఫిట్నెస్ గా ఉన్నాయో లేదో పరిశీలించాలని రవాణా, పోలీస్ శాఖ అధికారులు ఆదేశించారు అలాగే స్కూలు దేవాలయ పరిసర ప్రాంతాలలో మాదకద్రవ్యాలు, బెల్ట్ షాపులు నిర్వహించకూడదని. పాఠశాలల వద్ద ఉన్న పాన్ షాపులపై నిఘ ఉంచి అక్కడ ఎలాంటి పాన్ పరాగ్, గుట్కాలు, గంజాయి అమ్మకుండా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ గ్రామాలలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలని, గ్రామ శివార్లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని, స్కూల్ జోన్లో రూల్స్ పాటించాలని, స్కూల్ బస్సులో ఫిట్నెస్ గా ఉండాలని ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేయటం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, అన్ని కార్యాలయాల వద్ద నో హెల్మెట్ నో ఎంట్రీ అని బోర్డ్ పెట్టాలని సూచించారు. గోల్డెన్ హావర్ గురించి అవగాహన కల్పించి రోడ్డు ప్రమాద ఘటనల్లో క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించి ప్రాణాలు కాపాడాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల సమయంలో పౌరులు బాధ్యతగా ఉండాలని, ప్రమాద సంఘటనల్లో సహాయ సహకారాలు అందించే వారికి లీగల్ గా ఎలాంటి ఇబ్బందులకు గురి చేయడం జరగదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రమాదం పై సమాచారం అందించే డయల్ 100, 112, 108 ల గురించి ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వీటితో పాటు ప్రథమ చికిచ్చ, గోల్డెన్ హవర్ పై క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలకు అధిక లోడు తో వాహనాలు కారణమవుతాయని, ఆటోలలో, ట్రాలిలలో ఎక్కువ మందితో ప్రయాణం ప్రమాదకరమని తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఎంహెచ్వో వెంకటరమణ, డీఈవో అశోక్, ఆర్టిఓ జయప్రకాశ్ రెడ్డి, డి పి ఓ యాదగిరి, డ్రగ్ ఇన్స్పెక్టర్ సురేందర్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలను కాల్చకండి. పర్యావరణాన్ని పాడు చేయకండి- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

**సూర్యాపేట మే 30 నేటి వెలుగు ప్రతినిధి**

రైతులు వరి పంట కోసిన తర్వాత పొలం పై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విజ్ఞప్తి చేశారు. శనివారం అయన సూర్యాపేట మండలం కాసారాబాద్ గ్రామంలో వరి కొయ్యలను తగలబెట్టొద్దని రైతులకు అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. సాంద్రత పెంచుకునేందుకు అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని ఆ భారం కూడా రైతుల పైన పడుతుందని తెలిపారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి కోయ్యలను తగలబెట్ట వద్దన్నారు. రైతులు వరికొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకుగాను వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్



పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు . ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎసిపి ప్రసన్న కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ బాలకృష్ణ, ఎడిఎ జ్ఞానేశ్వరి, ఎ ఓ కృష్ణ సందీప్, సర్పంచ్ బూపాల్ రెడ్డి ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు సామాజిక బాధ్యత గా ప్రజల సంక్షేమానికి తమవంతు సహకారం అందించడం అభినందనీయం : జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్గొండ జిల్లా మే 30 నేటి వెలుగు ప్రతినిధి**



పరిశ్రమలు సామాజిక బాధ్యత గా ప్రజల సంక్షేమానికి తమవంతు సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.30.00 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది.ఈ సందర్భంగా శనివారం వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ తరఫున హెచ్ఆర్ హెడ్ మోహన్ , ప్లాంట్ హెడ్ కొడాలి అచ్యుత, భాస్కర్ రావు , డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సతీష్ తో కలిసి, ఈ ఆర్ ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సంబంధించిన సిఎస్ఆర్ చెక్కును జిల్లా కలెక్టర్ కు అధికారికంగా అందజేశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి జిల్లాలో ఉన్న వివిధ కంపెనీలు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.వి యాష్ కంపెనీ లాగే ఇతర కంపెనీలు సైతం ముందుకువచ్చి సామాజిక బాధ్యత గా సహకారం అందించాలని కోరారు. గృహనిర్మాణ శాఖ పి డి రాజ్ కుమార్,ఉపాధి కల్పనాధికారి పద్మ,తదితరులు ఉన్నారు.

## నల్గొండ జిల్లాలో ఫుడ్ సేఫ్టీ చట్టం ఉల్లంఘించిన వారిపై కొరడా.. రూ.7.91 లక్షల జరిమానా




**నల్గొండ జిల్లా మే 30 నేటి వెలుగు ప్రతినిధి:**

ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం-2006 నిబంధనలను ఉల్లంఘించిన వివిధ ఆహార వ్యాపార సంస్థలపై నమోదైన 20 అడ్జుడికేషన్ కేసుల్లో మొత్తం రూ.7,91,000 జరిమానాను నల్గొండ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ జె. శ్రీనివాస్ విధించినట్లు అధికారులు తెలిపారు.రిటైల్ దుకాణాలు, హోటళ్లు, కిరాణా షాపులు, తయారీ యూనిట్లు, పాల సేకరణ కేంద్రాలు (మిల్క్ సెంటర్లు), బేకరీలకు చెందిన కేసులను విచారించిన అనంతరం జరిమానాలు విధించినట్లు తెలిపారు.జిల్లాలో నిర్వహించిన తనిఖీల సందర్భంగా ఆహార భద్రతా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆహార వ్యాపారులపై కేసులు నమోదు చేసి, సంబంధిత ఆధారాలను అడ్జుడికేటింగ్ అధికారికి సమర్పించినట్లు వెల్లడించారు. ఈ కేసుల విచారణ సందర్భంగా సహాయ ఆహార నియంత్రణ అధికారి శ్రీమతి వి. జ్యోతిర్మయి, నల్గొండ జిల్లా ఆహార భద్రతాధికారి ఎన్. శివశంకర్ రెడ్డి హాజరై కేసుల వివరాలను సమర్పించారు.ఈ సందర్భంగా సహాయ ఆహార నియంత్రణ అధికారి వి. జ్యోతిర్మయి మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన మరియు సురక్షితమైన ఆహార పదార్థాలను అందించడం ప్రతి ఆహార వ్యాపార సంస్థ బాధ్యత అని అన్నారు. ఆహార వ్యాపారులు తమ వ్యాపారానికి అనుగుణంగా తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందివుండాలని, ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## వనపర్తిలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం.. ముఖ్య అతిథిగా చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

**వనపర్తి జిల్లా మే 30 నేటి వెలుగు ప్రతినిధి**



వనపర్తి జిల్లాలో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకానున్న తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం వనపర్తి జిల్లా ఐడిఓసి ఆవరణలో జూన్ 2వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, ప్రగతి నివేదికను తన ప్రసంగం ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించనున్నారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

## ‘సేవ్ ది టైగర్స్ 3’ ట్రైలర్ విడుదల.. నవ్వుల సునామీ పక్కా!



తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వెబ్ సిరీస్ ‘సేవ్ ది టైగర్స్’ మూడో సీజన్‌తో మళ్లీ వచ్చేస్తోంది. ఇప్పటికే రెండు సీజన్లు బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, భార్యాబాధితుల కథకు విశేష ఆదరణ తెచ్చిపెట్టాయి. తాజాగా, ఈ సిరీస్ మూడో సీజన్‌కు సంబంధించిన వినోదభరితమైన ట్రైలర్‌ను విడుదల చేశారు. జూన్ 19 నుంచి ఈ సిరీస్ డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయించేలా ఉంది. “పెళ్లి గురించి మనకు చిన్నప్పటి నుంచి అబద్ధాలే చెప్పారు” అంటూ అభినవ్ గోమటం చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది. పెళ్లిళ్లపై తమ గోడు వెళ్లబోసుకుంటున్న ముగ్గురు స్నేహితులు ఘంటా రవి (ప్రియదర్శి), రాహుల్ (అభినవ్ గోమటం), విక్రమ్ (చైతన్య కృష్ణ) సంభాషణలతో కథనం సరదాగా సాగుతుంది. “మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న వాడు నాకు దొరికితేనా” అని విక్రమ్ అనగానే, స్వర్గంలో ఇంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్ ప్రత్యక్షమవడంతో కథ ఫాంటసీ మలుపు తీసుకుంటుంది.ఆ తర్వాత, ముగ్గురు స్నేహితుల జీవితాలు అనూహ్యంగా మారిపోతాయి. ఘంటా రవి ఎమ్మెల్యేగా, రాహుల్ గొప్ప రచయితగా, విక్రమ్ ఓ పెద్ద కంపెనీకి సీఈవోగా కనిపిస్తారు. ఇది నిజమా లేక మరో ప్రపంచంలో జరుగుతోందా అనే గందరగోళం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈసారి ఫాంటసీ అంశాలను జోడించి వినోదాన్ని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లినట్టు స్పష్టమవుతోంది.ప్రియదర్శి, అభినవ్, చైతన్య కృష్ణతో పాటు పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మ తమ పాత్రలతో మరోసారి అలరించడానికి సిద్ధమయ్యారు. మహి వి. రాఘవ్, ప్రదీప్ అద్వైతం క్రియేటర్లుగా వ్యవహరిస్తున్న ఈ సిరీస్‌కు శ్రీరామ్ ఎరగం దర్శకత్వం వహించారు. ట్రైలర్ చూస్తే కామెడీకి మాత్రం లోటు ఉండదని భరోసా ఇస్తోంది.


## అందరికీ నచ్చాల్సిన పనిలేదు.. మా కష్టాన్ని గుర్తించండి: ఆన్‌లైన్ ట్రోల్స్‌పై చరణ్ కూల్ రియాక్షన్

సినిమాలు విడుదల కాకముందే నెగిటివ్ తీర్పులు ఇవ్వడంపై స్పందించిన చెర్రీ

నా నియంత్రణలో లేని విషయాలపై మాట్లాడనన్న రామ్ చరణ్

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో చరణ్ నటించిన ‘పెద్ది’ జూన్ 4న విడుదల

సినిమాలు థియేటర్లలోకి రాకముందే సోషల్ మీడియాలో కొందరు వాటి భవిష్యత్తుపై తీర్పులు ఇచ్చేస్తున్న ట్రెండ్‌పై గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ స్పందించారు. తన నియంత్రణలో లేని అభిప్రాయాల గురించి ఆలోచించే కన్నా, తన పనిపైనే దృష్టి పెడతానని ఆయన స్పష్టం చేశారు.ఓ సినిమాను చూడకుండానే దానిపై విపరీతమైన నెగిటివ్ ప్రచారం చేయడం గురించి ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ చరణ్ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. “దీనిపై నాకంటూ ప్రత్యేక అభిప్రాయం లేదు. మన నియంత్రణలో ఉన్నది మాత్రమే మనం చేయగలం. నాకు అర్థం కాని, అదుపు చేయలేని విషయాలపై నేను స్పందించను. నా పని నేను చేసుకోవాలి” అని చెర్రీ అన్నారు.రామ్ చరణ్ నటిస్తున్న ‘పెద్ది’ సినిమా విడుదల తేదీ రెండుసార్లు మారడంతో ఆన్‌లైన్‌లో దీనిపై విస్తృతమైన చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే చరణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. “మేం మా పని పట్ల నిజాయతీగా ఉన్నాం. చివరికి మేం సంతోషంగా ఉన్నాం. ప్రతి ఒక్కరికీ మా పని నచ్చాల్సిన అవసరం లేదు. కానీ, కనీసం మా శ్రమను గుర్తిస్తారని ఆశిస్తున్నా. వారికి అది నచ్చకపోయినా పర్వాలేదు” అని చరణ్ వివరించారు.బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ‘పెద్ది’ ఒక స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా. ఇందులో రామ్ చరణ్ క్రికెట్, రెజ్లింగ్, స్ప్రింటింగ్ వంటి మూడు క్రీడల్లో రాణించే అథ్లెట్‌గా కనిపించనున్నారు. జాన్వీ కపూర్, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి భారీ తారాగణం నటించిన ఈ చిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ‘మగధీర’తో స్టార్‌డమ్ అందుకున్న చరణ్, ‘రంగస్థలం’తో నటుడిగా ఉన్నత స్థాయికి చేరుకుని, ‘ఆర్ఆర్ఆర్’ చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు.



# తెలంగాణ రాష్ట్రంపై ఇంత కక్ష ఎందుకు..?

**బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**

**మిర్యాలగూడ పట్టణం మే 30 నేటి వెలుగు ప్రతినిధి**



ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన రాజకీయ నాయకుల పాఠశాలలు మరియు కళాశాలలు ఆసుపత్రులు, వ్యాపారాలు మొత్తం తెలంగాణ నుండి ఆంధ్రాకు పంపించాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడలో బీసీ భవన్ లో బీసీ సంఘం సమావేశం లో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పై ఆంధ్ర ప్రాంత నాయకులు పదే పదే విషం చిమ్ముతున్న కూడా వారికి సంబంధించిన వ్యాపార సముదాయాలు మరియు కళాశాల, పాఠశాలలు ,సినిమా థియేటర్లు మొత్తం పూర్తిస్థాయిలో ఆంధ్రా ప్రాంతానికి పంపించాలని ఆయన అన్నారు నిత్యం తెలంగాణ రాష్ట్రం మీద విషం చిమ్ము తు తెలంగాణ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు సిగ్గు లేకుండా వ్యాపారాలు, ఆస్తులు, పాఠశాల లు కళాశాలలో, ఆసపత్రులు తెలంగాణలో ఏర్పాటు చేసుకొని నిత్యం తెలంగాణ ప్రాంత ప్రజల రక్తం తాగుతున్న ఆంధ్ర ప్రాంత నాయకులకు సంబంధించిన వాటిని తక్షణమే ఆంధ్రాకు తరలించకపోతే మాత్రం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఏ విధంగా ఉద్యమం చేశామో అదే తరహాలో మళ్లీ ఉద్యమం చేసి మీ వ్యాపార సామ్రాజ్యాలపై దాడులు చేసే పరిస్థితి ఉంటుందని ఆయన హెచ్చరించారు.. తెలంగాణ నాయకులు సిగ్గు లేకుండా ఆంధ్రాలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు లో తెలంగాణకు సంబంధించిన వాళ్లే తెలంగాణ రాష్ట్రాన్ని కించపరిచినట్టుగా.మాట్లాడిన వ్యక్తులను తెలంగాణలో అడుగుపెట్టనివ్వద్దు అని ఆయన అన్నారు ఎన్నో త్యాగా లు పోరాటాలతో వచ్చిన ఈ తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి చీడ పురుగుల వల్ల. అమర వీరుల త్యాగ ఫలితం వృధా అవుతుందని ఆయన అన్నారు ఎంతో మంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే వచ్చిన ఈ తెలంగాణ రాష్ట్రంపై నిత్యం కొంతమంది కుట్రలు చేస్తూ తెలంగాణ ప్రజల ఆత్మ అభిమానాన్ని దెబ్బ తీస్తున్నారని. ఆయన అన్నారు ఇలాంటి తెలంగాణ వ్యతిరేకుల్ని గుర్తించి ప్రభుత్వం రాష్ట్రం ప్రయోజనాల దృష్ట్యా వారిని తెలంగాణ రాష్ట్రం నుంచి బహిష్కరించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ జేఏసీ కన్వీనర్ దాసరాజు జయరాజ్, మిర్యాలగూడ బీసీ జేఏసీ కో కన్వీనర్ చేగొండి మురళి యాదవ్ .బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కా నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యదర్శి రవీందర్ గౌడ్, ప్రణయ్, రాము తదితరులు పాల్గొన్నారు

# నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విస్తృత నాఖా బందీ -- ఆకస్మిక వాహన తనిఖీలు ..





**దాదాపు 1500 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు..**

**అనుమానస్పద వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ..**

**ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం ..**

**నేర నియంత్రణకు నిరంతర తనిఖీలు -- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ..**

**నల్గొండ జిల్లా మే 30 నేటి వెలుగు ప్రతినిధి**

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిల్లో నాఖా బందీ నిర్వహించి ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని వివిధ ప్రాంతాల్లో తనిఖీలను పరిశీలిస్తూ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో దాదాపు 1500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా 47 చెక్ పాయింట్లు ఏర్పాటు చేసి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండతో పాటు ప్రధాన పట్టణాలు, జాతీయ రహదారులు, రద్దీ కూడళ్లు, అనుమానాస్పద ప్రాంతాలు మరియు రాత్రి వేళల్లో యువకుల గుంపులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు మరియు ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, నంబర్ ప్లేట్లు పరిశీలించడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, సైలెన్సర్లు మార్పులు చేసిన వాహనాలు, నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే మొత్తం 260 వాహనాలపై చర్యలు తీసుకున్నారు.అదేవిధంగా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలు నమోదు చేశారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వాహనాల కదలికలపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ,

“జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించము. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారు, రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము” అని స్పష్టం చేశారు.అదేవిధంగా యువత చట్టాలను గౌరవించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించిన ఎస్పీ, రోడ్లపై స్టంట్లు చేయడం, అధిక శబ్దాలతో వాహనాలు నడపడం, ప్రజలకు అసౌకర్యం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.ప్రజలు పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై వెంటనే సమాచారం అందించాలని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**